

దేవస్థానంలోని చీరల కౌంటర్

దుర్గమ్మ సన్నిధిలో దోపిడీ

పాలక మండలిలోని కీలక వ్యక్తి కాసుల కక్కుర్తి

- దారి తప్పుతున్న వీఐపీ భక్తులు సమర్పించే చీరలు
- మూడో కంటికి తెలియకుండా ఓ చాంబరుకు..

విజయవాడ, ఆంధ్రజ్యోతి : దుర్గమ్మ దర్శనానికి ప్రొటోకాల్ కేటగిరీలో వచ్చిన భక్తులు ఇచ్చే చీరలు కొంతకాలంగా లెక్కల్లోకి రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు చీరల వ్యవహారాన్ని దేవస్థాన సిబ్బంది చూసేవారు. ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో చీరల లెక్కల్లో వ్యత్యాసాలు ఉన్నట్టు గుర్తించి నివేదిక ఇచ్చారు. ఇందులో ఉన్న ఉద్యోగుల పాత్రను ఏసీబీ గుర్తించింది. తర్వాత నుంచి చీరలను కాంట్రాక్టుకు ఇవ్వడం మొదలుపెట్టారు. భక్తులు ఇచ్చిన చీరలు ప్రైవేట్ కాంట్రాక్టరుకు చేరడానికి ముందు చీరల కౌంటర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అన్ని దర్శనాల్లో భక్తులు ఇచ్చిన చీరలు రశీదు కౌంటర్లకు చేరుతున్నా ప్రొటోకాల్ కేటగిరీలో భక్తులు ఇచ్చినవి మాత్రం అటువైపు వెళ్లడం లేదని తెలుస్తోంది.

ఆలయంలో ప్రొటోకాల్ కేటగిరీలో వచ్చిన భక్తులు అమ్మవారికి ఇచ్చే చీరలు లెక్క తప్పుతున్నాయా? చీరల కౌంటర్‌కు చేరకుండా ప్రత్యేక చాంబర్‌కు వెళ్తున్నాయా? అంటే ఆలయ వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ఈ వ్యవహారంపై ఇంద్రకీలాద్రిపై జోరుగా చర్చ నడుస్తోంది. ప్రొటోకాల్ దర్శనాల భక్తుల నుంచి వచ్చే చీరలు మూడో కంటికి తెలియకుండా మాయమవుతున్నాయి. ఇవి ఎక్కడికిపోతున్నాయనే అంశం ప్రొటోకాల్ దర్శనాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

మాయ రశీదు

కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి నిత్యం వేలమంది భక్తులు వస్తుంటారు. కొంతమంది భక్తులు అమ్మవారికి చీరలను సమర్పించుకుంటారు. రూ.300, రూ.100, ఉచిత దర్శన క్యూల్లో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని వెంట తెచ్చుకున్న చీరను బయటకు వచ్చే మార్గంలో ఉన్న కౌంటర్‌లో ఇవ్వాల్సి ఉంటుంది. దానిపై ఉన్న ధరకు 20-30 శాతం తగ్గించి ఆలయ సిబ్బంది ధర నిర్ణయిస్తారు. దీనికి సంబంధించి రశీదును భక్తులకు ఇస్తారు.

- మిగతా 6లో

ఈసారీ నాన్చుడేనా?


చెట్లు, చెదారంతో నిండిన యనమలకుదురు కాలువ

సాగునీటి కాల్వల్లో పూడికతో రైతుల ఆందోళన

- ప్రతి ఏడాది నీరు విడుదల సమయానికి పనులు
- పైపై పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు
- ఈ ఏడాది అయినా తీరు మారేనా?

జూన్ నుంచి రెండు సంవత్సరాలు ప్రారంభమవుతాయి. అందులో ఒకటి జూన్ నుంచి ఏప్రిల్ వరకు విద్యా సంవత్సరం ఉంటుంది. దీని మాదిరిగానే నడుస్తుంది ఇరిగేషన్ ఇయర్. జూన్ నెలలో కాల్వలకు నీరు విడుదల చేస్తే మార్చి, ఏప్రిల్ నెలల్లో ఆపేస్తారు. తిరిగి నీరు విడుదల చేసే సమయానికి కాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు, లాకులు, కల్వర్టుల మరమ్మతు పనులను పూర్తి చేయాలి. రైతులు దుక్కి, దున్ని, నాట్లు వేసుకునే సమయానికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నీటిని అందజేయాలి. ఇదంతా జలవనరుల శాఖ క్యాలెండర్. ఈ క్యాలెండర్ ప్రకారం జరగాల్సిన పనులు నెలలు గడుస్తున్నాయి. కాలువలు మూసివేసి ఉన్నప్పుడు చేయాల్సిన పనులు కొద్దిరోజులు నీరు వదిలే సమయానికి మొదలవుతున్నాయి. ఫలితంగా రైతులకు మేలు కాకుండా నష్టం జరుగుతోంది.


పూడుక పేరుకుపోయిన కానూరు కాలువ

కాలువల్లో గడచిన ఏడాది మొత్తం రూ.30 కోట్లతో తూటికాడ తొలగింపు పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనులు పూర్తిస్థాయిలో చేయకుండానే కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకున్నారు. జూన్‌లో కాలువలకు నీటిని విడుదల చేస్తారనగా దీనికి కొద్దిరోజుల ముందే టెండర్లు ఖరారు చేశారు. పనులు జరుగుతుండగానే నీటిని విడుదల చేశారు. దీంతో కాంట్రాక్టర్లు పైపైన పనులు చేసి మమ అనిపించారు. తర్వాత పొలాలకు నీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు సొంత డబ్బులతో తూటికాడను తొలగించుకోవాల్సి వచ్చింది. జలవనరుల శాఖ నుంచి కడకు వెళ్లిన ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ రావడానికి నెలల సమయం పడుతోంది. రైతుల నుంచి రెవెన్యూ అధికారులు నీటి తీరువా వసూలు చేస్తారు. ఈ నిధులు కడ వద్ద ఉంటాయి. జిల్లా వారీగా ఉన్న నిధులను నిల్వలను బట్టి పనులకు అనుమతుల ఇస్తారు. అధికారులు ప్రతిపాదనలు తయారు చేయడానికి నెలల సమయం తీసుకుంటే, వాటికి అనుమతులు ఇవ్వడానికి కడ మరికొన్ని నెలల సమయం తీసుకుంటుంది. ఈ మొత్తం జాప్యం రైతులకు తీరని నష్టాన్ని కలిగిస్తోంది. ఈ ఏడాది అయినా ఖరీఫ్‌కు నీటిని విడుదల చేసే సమయానికి ఓఅండ్ఎం పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

తయారీ దశలో ప్రతిపాదనలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : బందరు... ఏలూరు... రైవస్.. ఈ మూడు కాల్వలు కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి మూడు భాగాలు విడిపోయి దిగువకు ప్రవహిస్తాయి. అక్కడి నుంచి మరికొన్ని భాగాలు విడిపోయి స్థానిక నామకరణాలతో ప్రవహిస్తాయి. ఈ కాలువలే కృష్ణా జిల్లాకు సాగు, తాగునీటిని అందజేస్తాయి. ఈ కాల్వల ద్వారా సవ్యంగా నీరు ప్రవహించాలంటే పూడికతీతను జలవనరుల శాఖ ప్రతి ఏడాదీ తీస్తుంటుంది. తూర్పు డెల్టా కింద 6లక్షల78వేల531 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇది కాకుండా పొరుగున ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో 58 వేల ఎకరాల ఆయకట్టు సాగుతోంది. వెరసి 7లక్షల36వేల531 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ మొత్తం ఆయకట్టుకు బందరు, ఏలూరు, రైవస్ కాలువల ద్వారా సాగునీరు అందుతోంది. ఆయా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి అవసరాలను ఈ కాలువలే తీర్చాల్సి ఉంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రబీకి నీరు ఇవ్వలేదు. కొద్దిరోజుల క్రితమే తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేశారు. పది రోజుల క్రితం కాలువలను మూసివేశారు. తూర్పు డెల్టాలో మొత్తం నాలుగు డివిజన్లు ఉన్నాయి. కృష్ణా తూర్పు, కృష్ణా సెంట్రల్, డ్రెయినేజ్, స్పెషల్ డివిజన్లలో లాకులు, కల్వర్టులు ఉన్నాయి. కాలువలు మూసివేసిన తర్వాత ఓ అండ్ ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులను చేపడతారు. లాకులు, కల్వర్టుల మరమ్మతులతోపాటు కాలువల్లో పూడికతీతలు చేస్తుంటారు. ఆయా డివిజన్లలో ఏఈలు తమ పరిధిలోని కాలువలను పరిశీలించి ఏయే పనులు చేయాల్సి ఉందో ప్రతిపాదనలు తయారు చేస్తారు. ఈ ప్రతిపాదనలు డీఈలకు వెళ్తాయి. అక్కడి నుంచి ఈఈలకు, అనంతరం ఎస్ఈ టేబుల్ మీదకు వెళ్తాయి. ఎస్ఈ ఈ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సీఈకి పంపుతారు. అక్కడి నుంచి 'కడ' (కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)కి వెళ్తాయి. అక్కడ ఆమోదముద్ర పడిన తర్వాత మాత్రమే జిల్లా అధికారులు టెండర్ల ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది.

పైసలు కొట్టు.. ఫైల్ పట్టు!



కలెక్టరేట్‌లో ఇద్దరు డెప్యుటేషన్ ఉద్యోగులదే పెత్తనం

కలెక్టరేట్‌లో డెప్యుటేషన్‌పై వచ్చిన ఇద్దరు ఉద్యోగుల హవా కొనసాగుతోంది. వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను డెప్యుటేషన్‌పై కలెక్టరేట్‌లో నియమిస్తే వారు తమదైనశైలిలో అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి పనికీ ఒకరేటు కట్టి తాము అనుకున్న నగదు చేతికి అందేవరకు ఫైలు కదపకుండా తొక్కి పెడుతున్నారు. నిబంధనల మేరకు పనిచేస్తున్నట్లుగా నటిస్తూ తెరవెనుక వసూళ్ల పర్వం నడుపుతుండటంతో వీరి వ్యవహారశైలి ఇటీవల కాలంలో వివాదాస్పదమవుతోంది.

అడిగినంత ఇస్తేనే ఫైలు కదిలేది..

- వీరి దూకుడుకు బదిలీ కళ్లెంతో గత కలెక్టర్ బ్రేక్
- కలెక్టర్ మారిపోయాక ఇద్దరూ మళ్లీ కలెక్టరేట్‌కు డెప్యుటేషన్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కలెక్టరేట్‌లో భూ వ్యవహారాలు చూసే సెక్షన్‌లో ఉద్యోగి ఒకరు డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నాడు. గతంలో ఒక మాజీ ఎమ్మెల్యే, ఆయన బంధువులకు సంబంధించిన భూ వ్యవహారంలో పెద్ద మొత్తంలో నగదు తీసుకుని పనిచేయకపోగా, ఇంకా నగదు కావాలని ఈ ఉద్యోగి పట్టుబట్టాడు. ఎంతకూ పనిచేయకపోవడంతో ఈ అంశం బయటకు వచ్చింది. గతంలో పనిచేసిన కలెక్టర్ రంజిత్‌బాషా ఈ ఉద్యోగి వ్యవహారశైలిపై విచారణ చేయించారు. ఈ ఉద్యోగి దూకుడు ప్రదర్శిస్తుండటంతో గుడివాడ డివిజన్‌లోని నందివాడ మండలానికి బదిలీచేశారు. ఆరు నెలల పాటు అక్కడ పనిచేసిన ఈ ఉద్యోగి కలెక్టర్ బదిలీ అయిన కొద్ది రోజులకే మళ్లీ కలెక్టరేట్‌కు డెప్యుటేషన్‌పై వచ్చారు. ఈ ఉద్యోగిని ఇక్కడకు తీసుకురావడంలో కలెక్టరేట్‌లో పనిచేసే ఒక అధికారి కీలకపాత్ర పోషించారని గతంలోనే చర్చ నడిచింది. కలెక్టరేట్‌కు వచ్చిన ఈ ఉద్యోగి కొంతకాలంపాటు మిన్నకుండిపోయి మళ్లీ తనదైన శైలిలో వసూళ్లకు పాల్పడుతుండటం గమనించదగ్గ అంశం.

22-ఏలకు వసూళ్లు

మచిలీపట్నం డివిజన్ పరిధిలోని మండలాల్లో 22-ఏలో ఉన్న భూములకు షరతులు గల పట్టాలను రద్దుచేసి వాటిస్థానంలో రైతుల పేరుతో పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీనినే ఆసరా చేసుకుని ఈ ఉద్యోగి ఎకరానికి ఇంతరేటని నిర్ణయించి వసూళ్లకు పాల్పడటం వివాదాస్పదమవుతోంది. అవనిగడ్డ కోడూరు, గూడూరు, మచిలీపట్నం మండలాల్లో 22-ఏ భూములున్నాయి. వీటికి పట్టాలు మంజూరు చేసేందుకు పెద్దమొత్తంలో నగదును వసూలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. బందరు మండలంలోని బందరు వెస్ట్ రెవెన్యూ గ్రామ పరిధిలో 22-ఏలో ఉన్న భూములకు ఇటీవల పట్టాలు మంజూరు చేశారు. అధికార పార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నాయకుడొకరు ఈ అంశంలో జోక్యం చేసుకుని రెవెన్యూ సిబ్బందితో కలిసి పెద్దమొత్తంలో నగదు వసూలు చేశాడని రెవెన్యూ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. భీమవరానికి చెందిన బడాబాబులకు ఈ తరహా పట్టాలు ఇప్పించారని రెవెన్యూ ఉద్యోగులు అంటున్నారు. కలెక్టరేట్‌లోని భూ వ్యవహారాలు చూసే ఉద్యోగి పనితీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. కలెక్టర్ బుధవారం ఈ ఉద్యోగిని పిలిపించినట్టు సమాచారం.

ఆర్డీవో కార్యాలయంలోనూ ఇదేతీరు

మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం కలెక్టరేట్ ప్రాంగణంలోనే ఉంది. ఈ కార్యాలయంలో మోపిదేవి, నాగాయలంక మండలాల్లో పనిచేస్తున్న డెప్యూటీ తహసీల్దార్‌లు డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. మోపిదేవి మండలంలో పనిచేసే డెప్యూటీ తహసీల్దార్ డెప్యుటేషన్‌పై వచ్చి పనిచేస్తూ కార్యాలయంలో జరిగే ప్రతిపనికీ ఒకరేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడటం అలవాటుగా చేసుకున్నారు. వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్, ఇతర అవసరాల నిమిత్తం ల్యాండ్ కన్వర్షన్‌కు పెడితే, ల్యాండ్ కన్వర్షన్ కోసం రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వానికి ఫీజుగా ఎంత చెల్లిస్తే అంతమొత్తంలో తమకు ఇవ్వాలని పట్టుబట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. మచిలీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లోని ఉద్యోగులను కార్యాలయానికి పిలిపించి ఇంత చెల్లిస్తేనే మీ పనులు పూర్తవుతామని హుకుం జారీచేస్తూ ఉంటాడు. ప్రతి ఆదివారమూ మండలాల వారీగా వీఆర్వోలు ఈ ఉద్యోగి ఇంటికివచ్చి ప్రసన్నం చేసుకోవాలని హుకుం జారీ చేస్తూ ఉంటాడు.

- మిగతా 6లో


మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండు సెంటర్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న తెలుగు మహిళలు

పాత్రికేయులపై దాడులు అప్రజాస్వామికం

- తెలుగు మహిళల నిరసన ప్రదర్శన

- 6లో..

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి..

- గర్భం దాల్చిన బాలిక.. ఆలస్యంగా వెలుగులోకి

ఇంకెన్నాళ్లు!



కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల కోసం రవాణా వాహన యజమానుల ఎదురుచూపులు

కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు రాక.. వ్యాపారాన్ని నిర్వహించలేక.. రవాణా వాహన యజమానులు కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వాలు తమ మొర ఆలకించకపోవటంతో తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిపోతున్నారు. కరోనా ప్రభావంతో ఉత్పాదకత తగ్గి సతమతమవుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు రోడ్ ట్యాక్స్, సింగిల్ పర్మిట్, ఆల్ ఇండియా పర్మిట్ వంటి అంశాలు రవాణా వాహన యజమానులకు తీవ్ర భారంగా మారాయి. దశాబ్ద కాలంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లకు అనుమతులు రావడం లేదు. వీటిపై నిర్ణయాలు తీసుకోవాల్సిన రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో రవాణా వాహన యజమానులు ఆందోళన చెందుతున్నారు.

- ఈ-పర్మిట్‌తో వాహన యజమానులకూ, రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు మేలు
- ఉమ్మడి కృష్ణాలో 10 వేలమంది లారీ యజమానుల గగ్గోలు
- ఐదేళ్లుగా అడుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణా జిల్లా రవాణా రంగానికి కేంద్ర స్థానంగా ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40 వేల రవాణా వాహనాలు ఉన్నాయి. ఇందులో 25 వేలకుపైగా నేషనల్ పర్మిట్ లారీలున్నాయి. మిగిలిన 15 వేల లారీల్లో లోకల్‌గా తిరిగేవి ఉన్నాయి. వీటిలోనే పెద్ద, చిన్న లారీలు కూడా ఉన్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా తెలంగాణా జిల్లాకు సరిహద్దున ఉన్న ప్రాంతం. తెలంగాణా సరిహద్దు జిల్లాల్లో 15 వేలకుపైగా నేషనల్ పర్మిట్ లారీలు, 8 వేల వరకు లోకల్‌గా తిరిగే లారీలున్నాయి. రెండు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల నుంచి ప్రతిరోజూ స్థానికంగా పెద్దఎత్తున ఎగుమతులు, దిగుమతులు జరుగుతుంటాయి. పక్కనే ఉన్నా రెండు రాష్ట్రాలుగా ఉండటం వల్ల నేషనల్ పర్మిట్ ఉంటేనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఒకే రాష్ట్రంలో తిరిగే వాహనాలకు నేషనల్ పర్మిట్ తీసుకోవటం వల్ల బోలెడంత ఖర్చు అవుతోంది. అధిక భారంగా మారుతోంది. దీని బదులు రెండు రాష్ట్రాల్లో పరస్పరం తిరిగేలా కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు జారీ చేస్తే భారం తగ్గుతుందని లారీ యజమానులు కోరుతున్నారు. కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల ద్వారా ఆదాయం అంతా రెండు రాష్ట్రాలకు దక్కుతుంది. అదే నేషనల్ పర్మిట్ల ద్వారా వచ్చే ఆదాయం అనేక రాష్ట్రాలకు పంపిణీ అవుతుంది. కాబట్టి కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల వల్ల రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు, లారీ యజమానులకు ఉభయతారకంగా ఉంటుందని ఎప్పటి నుంచో కోరుతున్నా పట్టించుకోవటం లేదని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్, న్యూ ఆంధ్రా మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్ (నమత) పేర్కొన్నాయి.

కౌంటర్ సిగ్నేచర్‌తో ప్రభుత్వాలకు ఆదాయం

ఆలిండియా పర్మిట్ల జారీ కూడా పరిమితంగా ఉంది. రెండు రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల్లో ఉన్న 50 శాతం రవాణా వాహనాలకు కూడా నేషనల్ పర్మిట్లు లేవు. ఇవన్నీ ట్రిప్పులు వేయలేని పరిస్థితిలో ఉన్నాయి. ఇలాంటి రవాణా వాహనాలకు కూడా ప్రయోజనం కల్పించటానికి కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు దోహదపడతాయి. ఒక ఏడాదిలో ఒక రవాణా వాహనం నెలకు నాలుగు ట్రిప్పులు వేస్తే.. పది నెలలకు 30 నుంచి 40 ట్రిప్పులకు మాత్రమే పరిమితమౌతోంది. నేషనల్ పర్మిట్ (ఎన్‌పీ) రూ.16 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ కట్టిన మొత్తాన్ని దేశ వ్యాప్తంగా 26 రాష్ట్రాలకు వాటాలుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన రెండు రాష్ట్రాలకు వాటాగా రూ.647 వస్తుంది. రోజుకు సగటున 5 వేల వాహనాలు ఇలా తిరుగుతాయనుకుంటే రూ.32 లక్షల ఆదాయం మాత్రమే వస్తుంది. అదే కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు జారీ చేయటం వల్ల ఒక్కో వాహనానికి నేరుగా రూ.8 వేలే అవుతుంది. రోజుకు 5 వేల వాహనాల చొప్పున లెక్కిస్తే రూ.4 కోట్లు ఆదాయం వస్తుంది.

నేటి నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు



కోడూరు, ఫిబ్రవరి 21 : హంసలదీవి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్యం అవధాని బుధవారం తెలిపారు. స్వామివార్లను పెండ్లి కుమారుడిగా, పెండ్లి కుమార్తెగా అలంకరించనున్నట్టు చెప్పారు. సాయంత్రం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్ష స్వీకరణ, అఖండ దీపారాధన, ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 23న ఉదయం బలిహరణ, పంచామృత స్నపన, పాలాభిషేకం, రాజ్యలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, రాత్రి స్వామివార్ల కళ్యాణాన్ని నిర్వహిస్తామని తెలిపారు. 24న ఉదయం సాగర సంగమం, పాలకాయితిప్ప బీచ్ వద్ద సింధు స్నానాలకు వచ్చే భక్తులతో ప్రత్యేక పూజలు, రాత్రికి స్వామివారి రథోత్సవం, 25న అవభృదోత్సవం, సాయంత్రం ధ్వజారోహణం, పూర్ణాహుతి, రాత్రికి స్వామివారి స్వామివారి పవళింపు సేవతో ఉత్సవాలను ముగుస్తాయని చెప్పారు.



మద్దులపర్వలో అసంపూర్తిగా ఉన్న స్కూల్ వద్ద సెల్ఫీ దిగుతున్న ఉమా, చిన్ని

ప్రచార మోత తప్ప బడిరాత మారలేదు

- జగన్ సర్కార్‌కు ఉమా, కేశినేని శివనాథ్‌ల సెల్ఫీ ఛాలెంజ్

రెడ్డిగూడెం, ఫిబ్రవరి 21 : పూరి గుడిసెల్లో పాఠాలు, రేకుల షెడ్డులో రాతలు, శిథిల భవనాల్లో చదువులు ఇలా రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులు ఉన్నాయంటూ జగన్మోహన్ రెడ్డి సర్కార్‌కు టీడీపీ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, కేశినేని శివనాథ్‌లు బుధవారం సెల్ఫీ చాలెంజ్ చేశారు. రెడ్డిగూడెం మండలం మద్దులపర్వలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీలో పాల్గొన్న వారు మద్దులపర్వలో అసంపూర్తిగా ఉన్న ఎంపీయూపీ పాఠశాల ఎదుట సెల్ఫీ చాలెంజ్ విసిరారు. పాఠశాల భవనం నాలుగేళ్లుగా అసంపూర్తి ఉండిపోతే పాలకులు మాత్రం నాడు-నేడు కింద అద్భుతాలు చేసేశాం అంటూ జబ్బలు చరుచుకుంటున్నారన్నారు. అనేక బడుల్లో రెండో విడత పనులే పూర్తి కాలేదన్నారు. ఆరంభ శూరత్వంతో ఉన్న భవనాలు పడగొట్టిన ప్రభుత్వం కొత్తవి కట్టడంలో జాప్యం చేస్తున్నదని దుయ్యబట్టారు.

గోదావరి నీళ్లు తేవడమే లక్ష్యం : ఉమా

జి.కొండూరు : టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు నేతృత్వంలో ఏడాది తిరగకుండానే చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జున సాగర్ కాలువల్లో గోదావరి నీళ్లు పారించడమే లక్ష్యంగా పని చేస్తానని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం 'బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా ఆయన దుగ్గిరాలపాడు, గంగినేనిపాలెం, సున్నంపాడు, మునగపాడు, గడ్డమణుగు గ్రామాల్లో పర్యటించారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. చనమోలు అనిల్‌కుమార్ (బాబీ), ధనేకుల సాంబశివరావు (బుల్లిబాబు), పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ, పంటా పంచల నరసింహారావు, ఉయ్యూరు వెంకట నరసింహారావు, మంగలంపాటి వెంకటేశ్వరరావు, నూతక్కి రాజరావు, నూతక్కి అపర్ణ, ఉండిమోదుగుల సుబ్బారావు, పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు అండగా టీడీపీ, జనసేన : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21 : వైసీపీ పాలనలో బీసీల రిజర్వేషన్లలో భారీ కోత విధించి బీసీల హక్కులకు సీఎం జగన్‌రెడ్డి భంగం కలిగించారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. బుధవారం విశ్వబ్రాహ్మణ కాలనీ, అంజమ్మ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, పొట్లపాలెం, కొత్తపూడితో పాటు వివిధ ప్రాంతాలను రవీంద్ర పర్యటించారు. 'బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా విశ్వబ్రాహ్మణకాలనీలో స్వర్ణకారుల కార్యశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వర్ణకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి స్వర్ణకారులు తయారు చేసే నగలకు మార్కెటింగ్ కల్పిస్తామన్నారు. చేతి, కులవృత్తులను ఆదుకునేది తెలుగుదేశం ప్రభుత్వమేనన్నారు. విశ్వబ్రాహ్మణ కాలనీలో దివ్యాంగులకు వీల్‌చైర్లు అందచేశారు. కార్యక్రమంలో తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, రూరల్ అధ్యక్షుడు కుంచే నాని, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, ముంతా రవీంద్ర, మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, వాలిశెట్టి తిరుమలరావు, వాలిశెట్టి విమనేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చే అన్న క్యాంటీన్

- చంద్రబాబు స్ఫూర్తితో వెనిగండ్ల క్యాంటీన్‌కు 400 రోజులు పూర్తి
- రోజుకు 300 మందికి ఉచితంగా భోజనం



పేదలకు భోజనం వడ్డిస్తున్న జజఫిటవెనిగండ్ల

గుడివాడ : పేదలకు అందుబాటులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.5కే అన్న క్యాంటీన్‌లో భోజనం అందజేయగా, పేదల ద్వేషి అయిన జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను నిలిపివేశారు. కరోనా విపత్తులో ఎందరో పేదలు ఆకలితో అలమటించి మృత్యువాతపడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అమెరికాలో సాఫ్ట్‌వేర్‌లో ఉన్న గుడివాడకు చెందిన వెనిగండ్ల రాము మాతృభూమిపై మమకారంతో వెనిగండ్ల ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. అన్న ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 2023 జనవరిలో పట్టణంలో మొబైల్ అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. నాటి నుంచి 400రోజులుగా పేదలకు రోజుకు 300మందికి ఉచితంగా భోజనాన్ని అందజేస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చయినా వెనుకంజ వేయక ముందుకు సాగుతున్నారు.

పేదల ఆకలి తీర్చాలి : వెనిగండ్ల

రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్‌లను తిరిగి తెరుస్తాం. ప్రభుత్వ హయాంలో యధావిధిగా పట్టణంలో రెండు అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తాం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా మరొకటి సొంత ఖర్చుతో ఏర్పాటు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నా. ఎంత ఖర్చు అయినా పేదల ఆకలి తీర్చాలనేదే నా కోరిక.



వీరంకిలాకు ఎన్టీఆర్ కాలనీలో వైసీపీ నుంచి టీడీపీలోకి వస్తున్న వారితో వర్ల

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

పమిడిముక్కల, ఫిబ్రవరి 21 : వైసీపీ పాలనలో అరాచకాలు, అకృత్యాలతో ఇమడలేక రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని టీడీపీలో చేరేందుకు నాయకులు, కార్యకర్తలు తరలివస్తున్నారని పామర్రు టీడీపీ ఇన్‌చార్జ్ వర్ల కుమార్‌రాజా అన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం పమిడిముక్కల, వీరంకి, అమినాపురం గ్రామాల్లో పర్యటించి టీడీపీ, జనసేన పార్టీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా పమిడిముక్కల ఎన్టీఆర్‌కాలనీకి చెందిన వైసీపీ నాయకుడు ఇమిడాబత్తిన నారాయణతో పాటు పది కుటుంబాలు వైసీపీని వీడీ టీడీపీలో చేరగా కుమార్‌రాజ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కొల్లూరి బాబీ, నాదెళ్లసుబ్రమణ్యం, పమిడిముక్కల గ్రామ సర్పంచ్ ముళ్లపూడి సునీత, వైస్ సర్పంచ్ వెంకటేశ్వరరావు, తలశిల శ్రీనివాసరావు, నార్ల రమణ, బోలెం తాతారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు కన్నెర్ర జేస్తే..

జగన్‌రెడ్డి పార్టీ గల్లంతే

- మార్చి 4న 'మహిళా గళం' సభను విజయవంతం చేయండి
- మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, తలశిల స్వర్ణలత పిలుపు



తెలుగు మహిళల విస్తృత స్థాయి సమావేశంలో నినదిస్తున్న మహిళలు, చిత్రంలో కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21 : మహిళలు కన్నెర్ర జేస్తే సీఎం జగన్‌రెడ్డి పార్టీకి రానున్న ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, కృష్ణాజిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి తెలుగు మహిళల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, తలశిల స్వర్ణలతలు మార్చి 4వతేదీన జరగనున్న జిల్లాస్థాయి 'మహిళా గళం' కార్యక్రమంపై చర్చించారు. జిల్లాలో మండల స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొనకళ్ల మాట్లాడుతూ, టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళలు పార్టీ వెంటే ఉన్నారన్నారు. చంద్రబాబు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళా సాధికారికత తీసుకుని వచ్చారన్నారు. మహిళలు స్వతంత్రంగా ఆర్థికంగా జీవించే విధంగా వనరులు ఏర్పాటు చేశారన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించారన్నారు. స్వర్ణలత మాట్లాడుతూ, మహిళా శక్తిని మించింది లేదని అన్నారు. సూపర్ సిక్స్‌లో చంద్రబాబు మహిళల అభివృద్ధికి మహాశక్తి పేరుతో పెద్ద పీట వేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా సాధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, జిల్లా అధికార ప్రతినిధులు తదితరులు మాట్లాడారు.

పాత్రికేయులపై దాడులు అప్రజాస్వామికం

- తెలుగు మహిళల నిరసన ప్రదర్శన

మచిలీపట్నం టౌన్ : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాలు దాడులకు తెగబడటం అప్రజాస్వామికమని టీడీపీ తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత ధ్వజమెత్తారు. శ్రీకృష్ణపై దాడి, కర్నూలులో ఈనాడు కార్యాలయం పై దాడికి నిరసనగా బుధవారం మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగు మహిళలు బైఠాయించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మీడియాతో మాట్లాడారు. వైసీపీకి ఓటమి భయం పుట్టుకొచ్చిందన్నారు. విలేకరులపై ఇటీవల దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. మీడియా నడుపుతున్న సీఎం జగన్‌రెడ్డి తోటి మీడియా ప్రతినిధులపై, కార్యాలయాలపై దాడులు జరపడం సిగ్గుచేటన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య మాట్లాడుతూ, మీడియా ప్రతినిధులపై, కార్యాలయాలపై వైసీపీ కార్యకర్తలు దాడులు జరపడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా సాధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ తదితరులు పాల్గొన్నారు.



తెలుగుతల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మండలి

ప్రాథమిక విద్య మాతృభాషలో జరగాలి

- మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఫిబ్రవరి 21 : ప్రాథమిక విద్య మాతృభాషలో జరిగినప్పుడే భాషను పరిరక్షించుకోవటం సాధ్యమవుతుందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం అవనిగడ్డ గాంధీక్షేత్రంలో మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, మాతృభాషలో ప్రాథమిక విద్య బోధన జరగాలన్న యునెస్కో సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం దురదృష్టకరమన్నారు. తమ పేరు కూడా రాయలేని దుస్థితిలో పిల్లలు తయారవుతున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు మండలి వెంకట్రామ్, కొల్లూరి వెంకటేశ్వరరావు, కూనపరెడ్డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు బాధ్యతగా పనిచేయాలి

- జర్నలిస్టులపై దాడులు చేస్తే కఠిన చర్యలు
- కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి



పెదపారుపూడి స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్పీ నయీమ్ అస్మి

పెదపారుపూడి, ఫిబ్రవరి 21 : ఎన్నికల సమయంలో పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గుడివాడ డివిజన్ పెదపారుపూడి స్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ నయీమ్ అస్మి స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదు చేయటానికి స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పెదపారుపూడిలోని గ్రామాల మ్యాప్‌ను పరిశీలించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు ఎటువంటి అవాంతరాలు రాకుండా సహకరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో కఠినంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు అన్ని గ్రామాల్లో లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణ చేయాలని ఎస్ఐ జి.రాజుని ఆదేశించారు. గ్రామాల్లో గొడవలు సృష్టించే వారిపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. విలేకరులపై దాడులు చేసేవారి పట్ల కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఇటీవల ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఈనాడు కార్యాలయాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పెదపారుపూడి విలేకరులు ఎస్పీని కోరారు. విలేకరులపై దాడి చేసే వారి పట్ల కఠినంగా శిక్షలు ఉంటాయన్నారు. ఎస్పీతోపాటు గుడివాడ డిఎస్పీ పి.శ్రీకాంత్, పామర్రు సీఐ శుభకరరావు, పెదపారుపూడి ఎస్ఐ జి.రాజు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూలు వచ్చే వరకు జాబితాలో చేర్పులు-మార్పులు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లీరావు

వన్‌టౌన్, ఫిబ్రవరి 21 : ఎన్నికల షెడ్యూలు వచ్చేంతవరకు ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశముందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తర్వాత ఓటర్లజాబితాలో తొలగింపులకు, చేర్పులకు అవకాశం ఉండదన్నారు. ఫారం 7, ఫారం 6లను జిల్లా ముఖ్య ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుమతితోనే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టరేట్‌లో ప్రత్యేక బృందం పనిచేస్తోందన్నారు. ఇదే సమయంలో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ విజయవంతం చేయండి

వన్‌టౌన్ : ఇళ్లస్థలాల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సంబంధిత అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్‌లు సంయుక్తంగా సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాలు నుంచి మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ళు పథకం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పురోగతిపై సమీక్షించారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జాయింట్ సబ్‌రిజిస్ట్రార్, వీఆర్వో తదితరులు లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే వంద గ్రామాలు లక్ష్యాన్ని చేరుకున్నాయని, ఇదే స్ఫూర్తితో మిగతా గ్రామాల్లో కూడా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించిన పథకాలు, కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీని త్వరితగతం చేయాలన్నారు. మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్, కార్మిక శాఖ, పంచాయితీ రాజ్, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ, పేదరిక నిర్మూలనా విభాగం, ఆర్టీసీ, రైల్వే, తదితర అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. హైరిస్క్ ప్రాంతాలను గుర్తించేందుకు త్వరితగతిన సర్వే పూర్తి చేయాలన్నారు. నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో దోపిడీ

(5వ పేజీ తరువాయి)

అమ్మవారికి నిత్యం 5 నుంచి 7 చీరలు కడతారు. పౌర్ణమి నాడు అమ్మవారు స్వర్ణకవచ అలంకారంలో దర్శనమిస్తారు. సరస్వతీదేవి అలంకారంలో తెలుపు రంగు చీరలో దర్శనమిస్తారు. ఈ రెండు అలంకారాల్లో తప్ప మిగిలిన రోజుల్లో అమ్మవారికి 5 నుంచి 7 చీరలు కడతారు. ఈ భక్తులు కాకుండా వీఐపీ కోటాలో కొంతమంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. వారికి ప్రొటోకాల్ విభాగం సిబ్బంది దర్శనాలు చేయిస్తారు. ఈ ప్రొటోకాల్ దర్శనాలు రెండు విధాలుగా ఉంటాయి. కొండపైన ఉన్న సమాచార కేంద్రం వద్ద పేర్లు నమోదు చేయించుకుని దర్శనాలకు వెళ్తుంటారు. కొంతమంది ధర్మకర్తల మండలి ఛైర్మన్ కార్యాలయం నుంచి ప్రొటోకాల్ దర్శనాలకు వెళ్తుంటారు. ఈ కోటాలో దర్శనాలకు వెళ్లే భక్తులు అమ్మవారికి సమర్పించే చీరలే దారి తప్పుతున్నాయని ఇంద్రకీలాద్రిపై చర్చ నడుస్తోంది. ఇవన్నీ పాలకమండలికి చెందిన ఓ ప్రత్యేక చాంబరుకు వెళ్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఆలయ సిబ్బంది కక్కలేక మింగలేక ఉండిపోతున్నారు. చీరను కౌంటరులో ఇవ్వాలని అడిగితే అవతలి వ్యక్తుల వైపు నుంచి ఎలాంటి స్పందన వస్తుందోనని భయపడుతున్నారు. వీఐపీ దర్శనాల్లో చీరలు ప్రత్యేక చాంబరుకు వెళ్తున్నాయని ఆలయ సిబ్బంది కొందరు మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

ఎక్కడికి వెళ్తున్నట్టు?

చీరలను కౌంటర్‌లో ఇచ్చి రశీదు తీసుకునే క్రమంలో కొంతమంది భక్తులు తిరిగి ఆ చీరను తాము తీసుకుంటామని చెబుతారు. కొంతమంది మాత్రం చీరను దేవస్థానానికి ఇచ్చేస్తారు. పెళ్లిరోజు, పుట్టినరోజు వంటి ముఖ్యరోజుల్లో అమ్మవారికి తామిచ్చిన చీరను అలంకరించాలని కోరతారు. ఇలా అలంకరించిన చీరలను కొంతమంది భక్తులు తీసుకుంటారు. దీనికి సంబంధించి చీరల కౌంటర్‌లో దేవస్థానం సిబ్బంది నిర్ణయించిన ధరలను వారు చెల్లించాల్సి ఉంటుంది. ప్రొటోకాల్ కేటగిరీలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీసుకొచ్చే చీరలు రశీదు ఇచ్చే కౌంటరుకు వెళ్లడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ధర్మకర్తల మండలి తరపు నుంచి జరుగుతున్న ప్రొటోకాల్ దర్శనాల్లో ఈ వ్యవహారం జోరుగా జరుగుతోందని చెప్పుకొంటున్నారు. ఈ చీరలు ఎవరి చాంబరులోకి వెళ్తున్నాయన్నది సస్పెన్స్‌గా మారింది.

పైసలు కొట్టు.. ఫైల్ పట్టు!

(5వ పేజీ తరువాయి)

ఈ ఉద్యోగి పనితీరుపై అసంతృప్తితో ఉన్న గత కలెక్టర్ విచారణ చేయించి సదరు ఉద్యోగిని మోపిదేవి మండలానికి పంపేశారు. ఆ కలెక్టర్ బదిలీపై వెళ్లగానే మళ్లీ ఆర్డీవో కార్యాలయానికి ఈ ఉద్యోగి రావడం గమనించదగ్గం అంశం.

మళ్లీ వసూళ్ల దందా

ఇటీవల కాలంలో మచిలీపట్నంలో అధికారపార్టీకి చెందిన ఒక నాయకుడి భూ వ్యవహారంలో ఈ ఉద్యోగి రూ.2 లక్షలు తీసుకుని ఆ పనిచేయలేదు. దీంతో అధికార పార్టీ నాయకుడు పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారం ముదిరి పాకాన పడటంతో గతంలో పనిచేసిన అధికారి ఈ విషయం బయటకు రానివ్వద్దని, లక్ష రూపాయలు తిరిగి ఇచ్చి సర్దుబాటు చేసినట్టు కార్యాలయ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం నూతనంగా వచ్చిన అధికారికి ఈ ఉద్యోగి సలహాదారుగా వ్యవహరిస్తున్నట్టు నటిస్తూ తనదైన శైలిలో కార్యాలయంలో పనిచేసే ఒకరిద్దరు చిరుద్యోగులతో కలిసి తన ఇంటివద్దనే కార్యాలయంలో ఫైళ్ల క్లియరెన్స్‌కు పంచాయతీలు పెడుతూ పెద్దమొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడటం గమనించదగ్గ అంశం. తాను చేస్తున్న తప్పులను అధికారికి తెలియజేస్తున్నారనే కారణంతో కొందరు ఉద్యోగుల పనితీరు సక్రమంగా లేదని వారిని కార్యాలయం నుంచి బయటకు పంపేందుకు ఈ ఉద్యోగి కుయుక్తులు పన్నుతుండటం వివాదాస్పదమవుతోంది. కలెక్టరేట్‌లో భూ అంశాలు చూసే ఉద్యోగి, ఆర్డీవో కార్యాలయంలో పని చేసే ఉద్యోగి ఇద్దరూ కూడబలుక్కుని గుట్టుచప్పుడు కాకుండా భూ వ్యవహారాల్లో తమదైన శైలిలో నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని కలెక్టరేట్ ఉద్యోగులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. కలెక్టర్ ఈ ఇద్దరు ఉద్యోగుల పనితీరుపై విచారణ చేయిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కలెక్టరేట్‌లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు అంటున్నారు.

వైఎస్ షర్మిలకు ఘనస్వాగతం

గన్నవరం : ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తన కుమారుడు వివాహానంతరం బెంగళూరు నుంచి ఇండిగో విమానంలో బుధవారం రాత్రి ఇక్కడికి విచ్చేశారు. ఆమెకు పలువురు కాంగ్రెస్ నేతలు పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన కేవీపీ రామచంద్రరావు నివాసానికి వెళ్లారు.



మంగినపూడి బీచ్‌లో కొబ్బరిచెట్లు నాటుతున్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలి శర్మ

కోటిరూపాయలతో మంగినపూడి బీచ్ అభివృద్ధి

- కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడిబీచ్‌ను కోటి రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్టు కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. బీచ్‌లో చెట్లను పెంచే కార్యక్రమంలో భాగంగా బుధవారం జేసీ గీతాంజలి శర్మ, అధికారులతో కలిసి ఆయన కొబ్బరిమొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకేంద్రానికి అత్యంత సమీపంలో ఉన్న మంగినపూడి బీచ్‌ను అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. చెన్నై నుంచి తెప్పించిన 300 కొబ్బరిచెట్లను నాటుతున్నట్టు తెలిపారు. బీచ్‌లో రూ.40లక్షల తో టాయిలెట్లు, రూ.12లక్షలతో హైమాస్ట్‌లైట్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. బీచ్‌కు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, పేర్ని కిట్టు, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మీ, శీలం భారతి నాగ కుసుమకుమారి, ముడా ఛైర్‌పర్సన్ బొర్రా వెంకటనాగదుర్గాభవానీ, జిల్లా పర్యాటకశాఖ మేనేజరు రామలక్ష్మణ్, జిల్లాఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి. డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, తహసీల్దార్ పి.సతీష్, తాళ్లపాలెం మాజీ సర్పంచ్ వాలిశెట్టి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఖోఖో పోటీల్లో జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో జిల్లాకు చెందిన ఖోఖో జట్టు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించింది. జట్టును కలెక్టర్ అభినందించారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించిన జట్టు రూ.3లక్షల నగదు బహుమతితోపాటు మెడల్‌ను సాధించినట్టు జిల్లా క్రీడాప్రాధికారసంస్థ చీఫ్ కోచ్ ఝాన్సీ లక్ష్మి తెలిపారు. క్రీడాకారులను, కోచ్‌లు మదకప్రసాద్, కె.అనూరాధ, ఎన్.సుధీర్‌ను కలెక్టర్ అభినందించారు.

డీఎస్సీ గడువు పొడిగింపు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21 : డీఎస్సీ 2024 అభ్యర్థుల కోరిక మేరకు ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తును ఫీజుతో సహా సమర్పించేందుకు గడువు పొడిగించినట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



దళితవాడలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- గర్భం దాల్చిన బాలిక.. ఆలస్యంగా వెలుగులోకి

మోపిదేవి, ఫిబ్రవరి 21 : మండల కేంద్రమైన మోపిదేవిలో బాలికను లోబర్చుకుని వరుసకు తాతయ్య అయ్యే వ్యక్తి గర్భవతిని చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోపిదేవి దళితవాడకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న 14 సంవత్సరాల బాలికను ఇంటి పక్కనే ఉంటున్న సమీప బంధువు కర్లపూడి అంకినీడు మాయమాటలతో లోబర్చుకుని నాలుగు నెలల గర్భవతిని చేశాడు. బుధవారం రాత్రి బాలిక తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతుండగా, తల్లి, బంధువులు వైద్యం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం నాలుగు నెలల గర్భిణీగా వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు బాలిక బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటిలో టీవీ లేకపోవటంతో పక్కనే ఉన్న తాతయ్య ఇంటికి వెళ్తుందేదని, మాయమాటలు, డబ్బులు ఆశ చూపి బాలికను లోబర్చుకుని అనేక పర్యాయాలు లైంగికదాడికి పాల్పడినట్టు బంధువులు తెలిపారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తుండగా, మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం బాలికను మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అవనిగడ్డ డిఎస్పీ మురళీధర్ తెలిపారు. చల్లపల్లి సీఐ నాగ ప్రసాద్, మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణలు డీఎస్పీ వెంట ఉన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడు మృతి



గంపలగూడెం, ఫిబ్రవరి 21 : కిడ్నీ వ్యాధితో బాధపడుతూ నాగబత్తుని కృష్ణ (55) బుధవారం మృతి చెందాడు. అనుముల్లంక దళితవాడకు చెందిన కృష్ణకు నాలుగేళ్ల కిత్రం కిడ్నీలు ఫెయిల్ అయ్యి రెండేళ్లు విజయవాడ, తర్వాత రెండేళ్లు తిరువూరులో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఆరోగ్యం విషమించడంతో చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు.

వలలో చిక్కిన భారీ కొండచిలువ



చల్లపల్లి, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని నిమ్మగడ్డ లాకుల వద్ద కొండచిలువ వలలో చిక్కింది. పాత నడకుదురుకు చెందిన పీతా కోటేశ్వరరావు నిమ్మగడ్డ లాకులు ఎగువ ప్రాంతం కాలువలో చేపల కోసం మంగళవారం రాత్రి వల కట్టి వెళ్లాడు. బుధవారం వల ఒడ్డుకు లాగగా, 11 అడుగుల కొండచిలువ చిక్కుకుని ఉండటం చూసి తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. వలలో చిక్కిన కొండ చిలువ అప్పటికే చనిపోయి ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కాలంలో కొండ చిలువ కనిపించటం ఇది రెండవ సారి. గతంలో పురిటిగడ్డలో కొండచిలువ కనిపించిన సంగతి తెలిసిందే.

నాణ్యమైన పాల ఉత్పత్తితో అధిక లాభాలు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 21 : పాడిరైతుల సంక్షేమానికి విజయ డెయిరీ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం వలన పాలసేకరణ గతేడాది కంటే ఈ ఏడాది 10శాతం సేకరణ పెరిగిందని హనుమాన్‌జంక్షన్ పాలశీతల కేంద్రం క్లస్టర్ మేనేజర్ కె.కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పాడి రైతులు కోసం విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు నాయకత్వంలో పాలక మండలి కృషి చేస్తోందన్నారు. ప్రైవేట్ డెయిరీలు కంటే విజయ డెయిరీ అధిక ధరను అందించేడమే దీనికి కారణమని ఆయన తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం వలన రైతుల్లో విజయ డెయిరీ పట్ల సానుకూల స్పందన పెరిగిందన్నారు.

ధాన్యం సొమ్ము చెల్లించాలి

- కాకులపాడు ఆర్బీకే వద్ద రైతుల నిరసన
- సంఘీభావం ప్రకటించిన టీడీపీ, జనసేన నేతలు



రైతులకు మద్దతు తెలుపుతున్న టీడీపీ, జనసేన నేతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 21 : సకాలంలో సాగునీరందక ఆటుపోట్లను భరించి పండించి ఆర్బీకేల ద్వారా అమ్మిన ధాన్యానికి నెలలు గడుస్తున్నా సొమ్ము చెల్లించకపోవడం రైతులను మోసం చేయడమేనంటూ టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి చలసాని శ్రీనివాసరావు, జాస్తి భూపతిరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకులపాడు ఆర్బీకే వద్ద బుధవారం రైతులతో కలిసి టీడీపీ, జనసేన నాయకులు నిరసన చేపట్టారు. కాకులపాడు ఆర్బీకే ద్వారా విక్రయించిన రైతుల్లో 80శాతంకు పైగా ఇంత వరకూ చెల్లింపులు జరగలేదన్నారు. అధికారులను అడిగితే ప్రభుత్వమే నేరుగా బ్యాంకు ఖాతాలకు జమచేస్తుందని చెబుతున్నారని, ధాన్యం విక్రయించిన మూడు వారాల్లోగా డబ్బులు జమ అవుతాయన్న ప్రభుత్వ హామీని నిలుపుకోలేక రైతులను నిలువునా ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యాపారులు తక్కువ రేటు ఇస్తారని నమ్మించి ఆర్బీకేకు అమ్మాలని సూచించిన అధికారులెవరూ సమాధానం చెప్పట్లేదని మండిపడ్డారు. జనవరి 8వ తేదీ నుంచి ఆర్బీకేలకు ధాన్యం తోలిన రైతులకు కాకులపాడులోనే సుమారు రూ. 2 కోట్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆర్బీకే ద్వారా ధాన్యం అమ్మిన రైతుకు తక్షణం చెల్లింపులు జరపాలని లేకపోతే నిరసన ఉధృతం చేస్తామని టీడీపీ, జనసేన నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కామినేని శ్రీహరిరావు, చెన్నుబోయిన బీరయ్య, దొప్పలపూడి బాబు, జాస్తి ఫణీంద్ర బాబు, మట్టా ఆంజనేయులు, గారపాటి సుబ్బయ్య, తోట శ్రీనివాసరావు, వీరపనేని నాగేశ్వరరావు, బట్టు జార్జి, పడకల కీర్తి, గోగినేని రామకృష్ణ, ముదగిరి వెంకయ్య, షేక్ సుబాని, తదితరులు పాల్గొన్నారు.

జగన్ చెప్పేవన్నీ అబద్ధాలే

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఈడుపుగల్లులో టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న బోడె ప్రసాద్, దేవినేని రాజా

కంకిపాడు, ఫిబ్రవరి 21 : సీఎం జగన్ చెప్పేవన్నీ అబద్ధాలే అని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లులో బుధవారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2019 ఎన్నికల్లో ప్రజలకు జగన్ అన్నీ అబద్ధాలే చెప్పాడన్నారు. సీపీఎస్ రద్దు, మద్యపాన నిషేధం, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ వంటి అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ షకార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ వందిపాటి ఇందిర, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరి కృష్ణ, సుదిమళ్ల రవీంద్ర, షేక్ మా బు సుబాని, ముక్కాముల శంకర్, వీరపనేని వెంకటేశ్వరరావు, పందిపాటి సుధాకర్, చెల్లి సంగీత రావు, కాకుళ్ల సుధాకర్, కిలారు శ్రీను, పసుపులేటి సుబ్రహ్మణ్యం, సెంగెపు రంగారావు, పులి శ్రీనివాసరావు, వీరమాచినేని బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విలేకరులపై దాడి సిగ్గుచేటు

ప్రజలకు ప్రభుత్వానికి వారిధిలా పనిచేస్తున్న పత్రికలు, పత్రిక కార్యాలయాలపై దాడులకు వైసీపీ అల్లరి మూకలు తెగపడటం సిగ్గుచేటని టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతో ఇటువంటి చేష్టలకు అధికార పార్టీ నాయకులు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దాడులకు పాల్పడ్డ వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యాలయ బాధ్యుడు బొప్పూడి శివరామకృష్ణ, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు టీడీపీ, జనసేనదే

పెనమలూరు : వచ్చే ఎన్నికల్లో టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వమే అధికారం చేపడుతుందని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి హేమ, దేవినేని గౌతమ్ స్మిత దంపతులు పేర్కొన్నారు. యనమలకుదురు, తాడిగడప మునిసిపాలిటీలలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. వాసు, రామలింగేశ్వరరావు, ప్రసాద్, అనం తనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, తమ్ము అశోక్, మల్లంపాటి విజయలక్ష్మి, మేడసాని రత్నకుమారి, దండమూడి సాయిసుధ, పండల రజిని, దాసరి జగన్ పాల్గొన్నారు.

సైకో ఉడత ఊపులకు భయపడరు

విలేకరులపై వైసీపీ దాడులను ఖండించిన టీడీపీ నేతలు

పెనమలూరు, ఫిబ్రవరి 21 : సైకో జగన్‌రెడ్డి ఉడత ఊపులకు ఎవరూ భయపడరని టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు అన్నారు. బుధవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మూడు రోజుల కిందట రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడి మరువక ముందే మంగళవారం మరో ఆంధ్రజ్యోతి విలేకరిపైనా, ఈనాడు కార్యాలయం పైనా వైసీపీ గూండాలు దాడులు చేయడాన్ని టీడీపీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా సైకో ముఖ్యమంత్రి తన పార్టీ గూండాలను హెచ్చరించకపోవడం, కంట్రోల్ చేయకపోవడాన్ని బట్టి స్వయంగా జగన్‌రెడ్డే ఈదాడులను ప్రోత్సహిస్తున్నాడనుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగెపు రంగారావు, శొంఠి శివరాంప్రసాద్, తమ్ము అశోక్, అంగిరేకుల మురళి, బలగం నాగరాజు, కొక్కిలిగడ్డ ప్రసాద్, నాగేశ్వరరావు, సంగీత రావు, సాంబశివరావు, పీతా శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ద్వారంపూడి.. నోరు అదుపులో పెట్టుకో..

కాకినాడ సిటీ మాజీ శాసన సభ్యుడు వనమాడి వెంకటేశ్వరరావును విమర్శించే సత్తా ఎమ్మెల్యే ద్వారంపూడికి లేదని, తాను వనమాడిపై చేసిన వ్యాఖ్యలు అహంకారంతో చేసిన వ్యాఖ్యలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పీతా గోపీచంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా సమాజం కోసం యావదాస్తులను వదులుకొన్న అగ్నికుల క్షత్రియులపై ద్వారంపూడి వ్యాఖ్యలు కుల దురహంకారాన్ని చాటుతున్నాయని అభివర్ణించారు. అగ్నికుల క్షత్రియ జాతిని ఉద్దేశించి నువ్వు చేసిన వ్యాఖ్యలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వీరమ్మ తిరునాళ్లకు తరలివచ్చిన భక్తులు



వీరమ్మ తిరునాళ్లకు తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం

ఉయ్యూరు, ఫిబ్రవరి 21 : వీరమ్మతల్లి తిరునాళ్లకు బుధవారం భక్తులు తరలివచ్చారు. సోమవారం రాత్రి మెట్టినింటి నుంచి బయలుదేరిన అమ్మవారు గ్రామోత్సవం, ఊయల ఉత్సవం అనంతరం మంగళవారం రాత్రి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో కొలువై ఉన్న అమ్మవారిని దర్శించి మొక్కుబడి తీర్చుకునేందుకు వేకువ జామునుంచి భక్తులు వచ్చి క్యూలైన్లలో నిలుచున్నారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, గొర్రె పొటేళ్లతో వచ్చి ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి పొంగళ్ళు, పసుపు కుంకుమ, చీర సారె సమర్పించి చల్లని దీవెనలివ్వు తల్లీ అని వేడుకున్నారు. అమ్మవారికి పసుపు కుంకుమ, గాజులు సమర్పించేందుకు మహిళలు స్టాల్స్ వద్ద గుమికూడి కొనుగోలు చేశారు.

పటిష్టమైన ప్రణాళికతో విజయం సొంతం

ప్రముఖ సైకాలజిస్టు లక్ష్మీరావు

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 21 : పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పటిష్ట ప్రణాళి కలతో సిద్ధమైతే పరీక్షలలో విజయం సొంతమవుతుందని ప్రముఖ సైకాలజిస్టు లక్ష్మీరావు అన్నారు. సైకాలజిస్టుల సంఘం ఏపీఏ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విజయీభవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, పరీక్షల సమయంలో విద్యార్థులకు కొద్దిపాటి ఒత్తిడి ఉంటుందన్నారు. ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండి, ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఏపీఏ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ భావిశెట్టి మాట్లాడుతూ, విద్యార్థులు తమకు కఠినంగా ఉన్న సబ్జెక్ట్‌పై శ్రద్ధ చూపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఏ ఇండియా రాష్ట్ర కోశాధికారి అత్తోట తేజ, సభ్యులు దీనా, రవిప్రసాద్, ఎం. సూరపనేని రవి, నళినిరామ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గన్నవరం, ఫిబ్రవరి 21 : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నున్న సబ్ స్టేషన్ పరిధిలోని సూరంపల్లి, రామచంద్రపురం, మాదలవారిగూడెం, చనుపల్లివారిగూడెం ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరాను గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 21 : నైతిక విలువలతో కూడిన విద్యతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. రామన్నగూడెం హైస్కూల్ హెచ్‌ఎం నరహరిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. విలువలతో కూడిన విద్యతో విద్యార్థుల ద్వారా నవసమాజస్థాపన సాధ్యమన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఫిబ్రవరి 21 : మండలంలోని బుద్ధవరంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఏలూరు కాలువ వంతెన సమీపంలో 12అడుగుల ఎత్తు ఉన్న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఉదయం 10.29 గంటలకు జరిగింది. వాస్తు జ్యోతిష్యులు, వేదపండితులు జంధ్యాల రాజేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో పూర్ణాహుతి, మహాకుంభసం ప్రోక్షణ, మహదాశీర్వచనములు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే ముసునూరు రత్నబోస్, విజయవాడ దుర్గగుడి కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, సర్పంచ్ బడుగు బాలమ్మ తదితర ప్రముఖులు పాల్గొని విశేష పూజలు చేశారు. టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు రూ.2లక్షలు, మరో ఆలయానికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామికి అభిషేకాలు

పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో 23న జరిగే అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా విశేష పూజలు జరుగుతున్నాయి. బుధవారం ఉత్సవమూర్తులకు అభిషేకాలు, పూజలు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ఏర్పాట్లను పర్యవేక్షించగా మాజీ సర్పంచ్ గూడపాటి తులసీమోహన్, జాస్తి ఫణిశేఖర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ముగిసిన సీతారామలక్ష్మణస్వామి ఆలయ వార్షికోత్సవం

పెనమలూరు : పెనమలూరు చిన్నగుడి సెంటరు శ్రీసీతారామలక్ష్మణస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఆలయంలో బుధవారం విశేష హోమాలు, పూజా కార్యక్రమాలు గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్చకులు వేదాంతం రాజగోపాల చక్రవర్తి స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అగ్నిబాధిత కుటుంబాలకు సాయం



బాధితులకు నిత్యావసరాలు, దుస్తులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 21 : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధి నాగన్నగూడెంలో ఇటీవల సంభవించి అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయి కట్టుబట్టలతో మిగిలిన రెండు కుటుంబాలకు ఉయ్యూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ క్లబ్ ట్రెజరర్ పూర కిషోర్‌కుమార్, ప్రతినిధి దినవహి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా పశుగణాభివృద్ధి ఉపసంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు



పశుపోషకులకు బహుమతులు అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ స్నిగ్ధ

పెనమలూరు, ఫిబ్రవరి 21 : లేగదూడల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి ఉపసంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం జిల్లా పశువుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చోడవరంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పడమట స్నిగ్ధ, సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం, ఏడీఏ డాక్టర్ శ్రీనివాసరావు, పశువైద్యులు డాక్టర్ బాబూరావు, డాక్టర్ మాధవరావు, డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

సోషలిజం స్థాపనకు రెడ్‌బుక్ దిక్సూచి



మాట్లాడుతున్న గన్నె వెంకట్రావు

గన్నవరం, ఫిబ్రవరి 21 : సోషలిజం కోసం కృషి చేస్తున్న నాయకులకు రెడ్ బుక్ ఒక దిక్సూచి అని ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం రెడ్‌బుక్‌పై అవగాహన సదస్సు ఆ పార్టీ మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, ఉద్యమ సహచరుల నుంచి, ఇతరుల నుంచి ఎదురవుతున్న ఆటంకాలను అధిగమించేందుకు అనుసరించాల్సిన పద్ధతులు మొదలు కొని సోషలిస్ట్ సమాజం సాధించుకునే వారకూ తెలుసుకునే పుస్తకమే రెడ్‌బుక్ అన్నారు. రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ మద్దుకూరి విజయ్ కుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు మల్లంపల్లి జయమ్మ పాల్గొన్నారు.

ఎట్టకేలకు జంక్షన్ రహదారికి మరమ్మతులు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 21 : జాతీయ రహదారిపై జంక్షన్ బైపాస్ ఏర్పడడంతో అధ్వానంగా మారిన ప్రధాన మార్గానికి ఎట్టకేలకు హైవే అధికారులు మరమ్మతులు చేపట్టారు. పనులను నేషనల్ హైవే అధికారులు బుధవారం ప్రారంభించారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేసి ఆర్ అండ్ బీకి అప్పగించనున్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

ఉయ్యూరు, ఫిబ్రవరి 21 : ఏజీ అండ్ ఎస్‌జీ ఎస్ కళాశాలలో బుధవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ నిర్వహించారు. సుశృత ఆయుర్వేద వైద్యశాఖ ప్రతినిధి జీవీ పూర్ణచంద్ ముఖ్య అతిథిగా హాజరై మాతృభాష గొప్పదనం, ఇతరభాషలు, సంస్కృతులు, సంప్రదాయాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీరామ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, తెలుగు విభాగ అధిపతి జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గన్నవరం : మండలంలోని సూరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు జరిపారు. అనంతరం కవులు, రచయితల ఫొటోలతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయినీ డాక్టర్ పి.సుభాషిణి మాతృభాష విశిష్టతను వివరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

పార్టీ మారితే శిలాఫలకాలపై ఎంపీ బాలశౌరి పేరెయ్యరా..

● అధికారులకు రాజకీయాలెందుకు?: జనసేన నాయకుడు మాదివాడ రాము

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21: "కలెక్టరేట్‌లో కాంపౌండ్ వాల్, ఇతర నిర్మాణ పనుల శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై ఎంపీ వల్లభనేని బాలశౌరి పేరు లేదు. ఎంపీ బాలశౌరి పార్టీ మారితే పేరు ముద్రించరా? అధికారులకు రాజకీయాలెందుకు? ఎమ్మెల్యే పేర్ని నానికి, ఎంపీ బాలశౌరికి అభిప్రాయ బేధాలు ఉంటే అధికారులు ప్రొటోకాల్ పాటించరా?" అని జనసేన నాయకుడు మాదివాడ రాము ప్రశ్నించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంపీ పేరు శిలాఫలకంపై ముద్రించని అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీ పేరును కలెక్టర్ కూడా విస్మరించడం సరికాదన్నారు. చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళతామన్నారు.

పెదకళ్లేపల్లిలో మహాశివరాత్రి ఏర్పాట్లపై నేడు సమీక్ష

మోపిదేవి, ఫిబ్రవరి 21: పెదకళ్లేపల్లిలో దుర్గా నాగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి ఏర్పాట్లపై గురువారం దేవస్థానం ప్రాంగణంలో మధ్యాహ్నం 3 గంటలకు మచిలీపట్నం ఆర్డీవో శ్రీవాణి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు తెలిపారు. ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన సూచించారు.

అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి


తోట్లవల్లూరు, ఫిబ్రవరి 21: ఐలూరు పుణ్యక్షేత్రంలో మార్చి 8న మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి సూచించారు. రామేశ్వరస్వామి దేవస్థానం వద్ద బుధవారం వివిధశాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కృష్ణానదిపాయలో జల్లు స్నానాలకు బోర్లు, తాగునీటికి చేతి పంపులు వేయడం, మహిళా భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన, దేవస్థానం వద్ద దైవదర్శనానికి చేయాల్సిన ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్ సీహెచ్ ఎస్ఎస్‌వీ ప్రసాద్, ఈవో జయశ్రీ, ఎస్సై విశ్వనాథ్, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కూచిపూడి, ఫిబ్రవరి 21: మొవ్వలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి శనివారం వరకు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో ఎస్.వి.సుబ్బారావు తెలిపారు. గురువారం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మహాకవి క్షేత్రయ్య ఆరాధనోత్సవాలు, శుక్రవారం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం, శనివారం ధ్వజారోహణ, పవళింపుసేవ, విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

నేటి నుంచి చౌడేశ్వరీదేవి జ్యోతిర్మహోత్సవాలు

పెడన: గూడూరు మండలం కప్పలదొడ్డిలో చౌడేశ్వరీదేవి జ్యోతిర్మహోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున ఆన పూజ చేస్తారు. సాయంత్రం కొమారకం, రాత్రి జ్యోతిప్రజ్వలన, అలుగు సేవ, ఆదివారం రాత్రి నగరోత్సవం (కత్తుల ఊరేగింపు)నిర్వహిస్తారు.







జర్నలిస్టులపై దాడులు అమానుషం

● టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో నిరసనలు

మోపిదేవి, ఫిబ్రవరి 21: ప్రభుత్వానికి - ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ నిస్వార్థంతో పని చేసే జర్నలిస్టులపైన, పత్రికా కార్యాలయాలపైన వైసీపీ దాడులు అమానుషం, అప్రజాస్వామికమని టీడీపీ, జనసేన పార్టీ నాయకులు అన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ, ఓ దినపత్రిక ప్రాంతీయ కార్యాలయంపైన వైసీపీ మూకలు దాడి చేయటాన్ని ఖండిస్తూ బుధవారం రాత్రి మోపిదేవిలో ఇరుపార్టీల నేతలు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఓడిపోతానన్న భయంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాలం గడుపుతున్నారని వారు పేర్కొన్నారు. ప్రధాన కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దన రావు, జనసేన మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, నాయకులు మెడబలిమి మల్లికార్జునరావు, రావి రత్నగిరి, అరజా కిరణ్‌కాంత్, మెరకనపల్లి నరేష్, శీలం శ్రీరాములు, భోగిరెడ్డి సాంబయ్య, కడవకొల్లు సీతారామాంజనేయులు, బాల కోటేశ్వరరావు, నాదెళ్ల శరత్‌చంద్రబాబు, బళ్లా సీతారామప్రసాద్, సనకా గౌరీశంకర్, ఏసు తదితరులు ఉన్నారు.



మోపిదేవిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు, అవనిగడ్డలో నల్లబ్యాడ్జీలతో నిరసన

అరాచకాలు బయటపెడుతున్నారన్న అక్కసుతోనే దాడులు

అవనిగడ్డ: తమ అరాచకాలు బయటపెడుతున్నారనే అక్కసుతోనే జర్నలిస్టులపై వైసీపీ మూకలు దాడులకు తెగబడుతున్నాయని, జర్నలిస్టులపై ప్రభుత్వం, వైసీపీ నేతలు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని నేతలు టీడీపీ నేతలు ఆరోపించారు. జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై వరుసగా జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా టీడీపీ మండల నాయకులు బుధవారం అవనిగడ్డలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. టీడీపీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్రా సుధాకర్, బచ్చు రఘునాథ్, మాచవరపు ఆదినారాయణ, మేడికొండ విజయ్, కోట సాయి, శ్రీనివాసరావు, షేక్ బాబావలి, ఇమ్మానియేలు, పాండురంగారావు, జనసేన నాయకులు విజయ్ పాల్గొన్నారు.

వైసీపీ అల్లరిమూకల పిచ్చి పరాకాష్టకు: కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి: వైసీపీ అల్లరి మూకల పిచ్చి పరాకాష్టకు చేరిందని పత్రికా స్వేచ్ఛను హరించేలా దాడులు చేస్తున్నారని ఇది సిగ్గుచేటు అని టీడీపీ పెడన ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్ ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఓ దినపత్రిక కార్యాలయం, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం దుర్మార్గమని, ముఖ్యమంత్రికి నిజాలు వెలుగులోకి తెచ్చే విలేకరులన్నా, పత్రికా కార్యాలయాలన్నా చులకనా భావమని తెలిపారు. దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కాగిత డిమాండ్ చేశారు.



నాగాయలంక మండల కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

8,660 కోట్లు స్వాహా చేసిందీ ప్రభుత్వం

● వెంటనే పంచాయతీల ఖాతాల్లో ఆ నిధులు జమ చేయాలి
● మండల సమావేశాన్ని బహిష్కరించి టీడీపీ ప్రజాప్రతినిధుల నిరసన

నాగాయలంక, ఫిబ్రవరి 21: 14, 15వ ఆర్థిక సంఘం నిధులు 8,660 కోట్లను పంచాయతీ పాలకవర్గాల అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం స్వాహా చేసిందని, భావదేవరపల్లి సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి ఉదయభాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాహా చేసిన నిధులను పంచాయతీలకు తిరిగి ఇవ్వాలని, బుధవారం మండలంలోని తోటి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీపీ భోగాది రాఘవరాణి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వారందరూ బహిష్కరించారు. అనంతరం ఎంపీపీకి వినతిపత్రాన్ని అందజేశారు. మండల పరిషత్ భవనం గేటు వద్ద తమ నిరసనను తెలిపారు. పెదకమ్మవారిపాలెం సర్పంచ్ తలశిల అర్జునరావు, గుల్లలమోద సర్పంచ్ మేడా బసవమ్మ, సొర్లగొంది సర్పంచ్ కొల్లాటి లక్ష్మీ, పెదపాలెం సర్పంచ్ దున్నా రాజేష్, నాగాయలంక -1 ఎంపీటీసీ నాగిడి ఆదిలక్ష్మీ, గుల్లలమోద ఎంపీటీసీ సభ్యుడు విశ్వనాథపల్లి లక్ష్మీనాగేశ్వరమ్మ పాల్గొన్నారు. సభలో టీడీపీ ప్యానల్ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులలకు వైసీపీ ప్రజాప్రతినిధులు సంఘీభావాన్ని తెలిపారు. మండల సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు వివిధ శాఖల పనితీరును సమీక్షించారు.

మత్స్య పరిశ్రమతో దివిసీమకు ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కమిడి మధుబాబు

అవనిగడ్డ, ఫిబ్రవరి 21: మత్స్య పరిశ్రమతో దివిసీమ ప్రాంతానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రధాన విభాగాధిపతి ప్రొఫెసర్ కమిడి మధుబాబు తెలిపారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం, ఆంధ్రప్రదేశ్ ఎకనిమిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మత్స్యపరిశ్రమపై నిర్వహించిన ఒక రోజు జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. సాధారణ అంతర పంటలు మాదిరే రైతులు ఆక్వా పొనిక్స్ అంటే చేపలు, మొక్కలు ఏకకాలంలో అంతర పంటలుగా వేసి ఆదాయం పెంచుకోవచ్చని ఇండియన్ ఎకనమిక్ అసోసియేషన్ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ టి.ఎల్.ఎన్.స్వామి తెలిపారు. ఫిష్ సెంటర్స్ ఏర్పాటు చేసి శీతలీకరణ, రవాణా, మార్కెట్ సౌకర్యాలు అందించాలన్నారు. మత్స్యసంపద యోజన ఆవశ్యకత తెలిపారు. చేపల పెంపకం పద్ధతులు, ఆర్థిక ప్రభావాలు, ఆక్వా రంగంలో అవస్థాపనా సౌకర్యాల ఆవశ్యకతను ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ అసోసియేషన్ ట్రెజరర్ ప్రొఫెసర్ ఎం.కోటేశ్వరరావు తెలిపారు. సాగర మాల, ఆధునిక మత్స్య సంపద పద్ధతులపై పరిశోధన జరగాలన్నారు. ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణాకు చెందిన వివిధ యూనివర్సిటీ, కళాశాలల ఆచార్యులు, పరిశోధన విద్యార్థులు 50 మంది పరిశోధనా పత్రాలు సమర్పించారని సెమినార్ కన్వీనర్ అర్థశాస్త్ర అధ్యాపకురాలు వీరకుమారి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ అసోసియేషన్ సభ్యులు ప్రొఫెసర్ పరమేశ్వరరావు, ప్రిన్సిపాల్ డి.ఉమారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అడపా బాబ్జీ విగ్రహావిష్కరణ

గుడివాడ: తన శక్తికి మించి పేదలకు సేవలందించి పేదలు, తన అభిమానుల గుండెల్లో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా బాబ్జీ చిరస్థాయిగా నిలిచిపోయారని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. బుధవారం ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల సెంటర్‌లో బాబ్జీ సేన, అభిమానులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అడపా బాబ్జీ విగ్రహాన్ని బాబ్జీ కుమార్తె శ్రావణితో కలిసి కొడాలి నాని ఆవిష్కరించారు.

నర్రా రవీంద్రారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

అవనిగడ్డ, ఫిబ్రవరి 21: సామాజిక మాధ్యమాల్లో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజుపై వైసీపీ సోషల్ మీడియాకు చెందిన పులివెందుల వాసి నర్రా రవీంద్రారెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని, కులం పేరుతో కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తున్నారని, రవీంద్రారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని టీడీపీ నేతలు అవనిగడ్డలో పోలీ సులకు ఫిర్యాదు చేశారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, మాచవరపు ఆదినారాయణ, కర్రా సుధాకర్, మేడికొండ విజయ్, తండు గంగాధర్, కొల్లూరి ఇమ్మానియేలు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

మర్రెడ్డిపై హత్యాయత్నం దారుణం

మచిలీపట్నం: రైతుల సమస్యలపై పోరాడుతున్న తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై హత్యాయత్నం, రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడి దారుణమని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. బుధవారం కానూరులోని తన కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీనివాసరెడ్డిని కుట్రపూర్వకంగా తీసుకుని వచ్చి దాడి చేశారన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి రిమాండుకు పంపాలన్నారు. శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వైసీపీ గూండాలను వెంటనే అరెస్టు చేయాలన్నారు.

సచివాలయం ముట్టడిలో పాల్గొనండి

● నిరుద్యోగులకు డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి పిలుపు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21: దగా డీఎస్సీ వద్దు - మెగా డీఎస్సీ కావాలంటూ గురువారం నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ సచివాలయం ముట్టడి కార్యక్రమంలో నిరుద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో మీడియా ప్రతినిధులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. మైనారిటీ నాయకుడు మహమ్మద్ ఆరీఫ్ మిత్ర బృందాన్ని పార్టీలో చేర్చుకున్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు జి.నాగబాబు, అబ్దుల్ మతీన్, కె.గణేష్‌బాబు, సురేష్‌రెడ్డి, లింగాల సుధాకర్, కోకా ఫణిభూషణ్, చంద్రశేఖర్, ఎన్. కుమారి, రజియా సుల్తానా పాల్గొన్నారు.

పట్టాభి భవన అనుమతులపై అవాస్తవాలు చెబుతున్న పాలకులు: మాదివాడ రాము

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21: పట్టాభి స్మారక భవన అనుమతులపై వైసీపీ పాలకులు అవాస్తవాలతో ప్రజలను మభ్యపెడుతున్నారని జనసేన నాయకుడు మాదివాడ రాము అన్నారు. బుధవారం తన కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సీఎం ఇచ్చిన ఉత్తర్వులకు కూడా మచిలీపట్నం వైసీపీ నాయకులు విలువ ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. ఓ పక్కన వైసీపీ కార్యాలయం నిర్మిస్తూ, పట్టాభి భవనానికి అనుమతులు ఇవ్వకపోతే జగన్ ఎన్నికల ప్రచారానికి మచిలీపట్నం వచ్చినప్పుడు బందరు ప్రజలు పట్టాభి స్మారక భవనంపై నిలదీస్తారన్నారు. ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వేమూరి రామకృష్ణారావు, మోపర్తి సుబ్రహ్మణ్యం, పీవీ ఫణికుమార్ పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లి పీహెచ్‌సీలో తొలి కాన్పు విజయవంతం

మోపిదేవి, ఫిబ్రవరి 21: పెదకళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మేకల నాగశ్రావణి అనే మహిళకు బుధవారం కాన్పును విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ కె.హారిక తెలిపారు. ఇది పీహెచ్‌సీలో చేసిన తొలి కాన్పు అని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు ఉచితంగా చేసి హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్లే వరకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తారని, జననీ సురక్ష యోజన పథకం ద్వారా రూ.1000 పారితోషికాన్ని తల్లి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. గ్రామీణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ చేసుకోవాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బందిని గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

దివి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కమిటీ

అవనిగడ్డ, ఫిబ్రవరి 21: దివి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కమిటీ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ధన సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఎం.విజయకుమార్, కోశాధికారిగా వి.సుధాకర్, కమిటీ సభ్యులు చిట్టా వెంకట చంద్రశేఖర్, నంబూరి రాజేష్, కోడూరు సాయి, అన్నం వెంకట సుబ్బారావు, అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

గిలకలదిండిలో బెల్టుషాపు నిర్వాహకురాలి అరెస్టు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21: నగర కార్పొరేషన్ పరిధిలోని గిలకలదిండిలో బుధవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో దాడులు జరిపింది. బెల్టుషాపు నిర్వహిస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి 46 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుంది.

చల్లపల్లిలో జన ఔషధి మందుల షాపు ప్రారంభం

చల్లపల్లి, ఫిబ్రవరి 21: ఫార్మాస్యూటికల్ మెడికల్ డివైసెస్ బ్యూరో ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం పేరుతో జనరిక్ మందుల షాపును చల్లపల్లి సొసైటీ ఆవరణలో బుధవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. ఇక్కడ 50 నుంచి 90 శాతం వరకు సబ్సిడీ ధరలకు మందులు లభిస్తాయని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సొసైటీ చైర్మన్ పాగోలు ఫణి, సీఈవో కృష్ణారావు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లు సిద్ధం చేయండి

● అధికారులకు ఆర్వో శ్రీదేవి ఆదేశం

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 21: ఎన్నికలకు పోలింగ్ బూత్‌లను సిద్ధం చేయాలని అధికారులను పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి బి.శ్రీదేవి ఆదేశించారు. తోట్లవల్లూరు మండలంలో బుధవారం శ్రీదేవి పర్యటించి 38 పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. పోలింగ్‌బూత్‌లలో కరెంటు, తాగునీటి వసతికి ఇబ్బంది లేకుండా చూడాలని తహసీల్దార్ ఎం.కుసుమకుమారికి సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, బీఎల్వోలు పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షురాలిగా బసవమ్మ

పమిడిముక్కల, ఫిబ్రవరి 21: డీసీసీ ఉపాధ్యక్షురాలిగా కొడాలి బసవమ్మ నియమితులయ్యారు. పమిడిముక్కలలో బుధవారం పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డీవై దాస్ నుంచి ఆమె నియామకపత్రాన్ని అందుకున్నారు.

కరాటేలో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ: మచిలీపట్నంలో ఈనెల 18న నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు ప్రతిభ చూపి, పలు పతకాలను సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 11ఏళ్ల లోపు బాలికల కటా విభాగంలో జి.నిదర్శిని ద్వితీయ, ఎనిమిదేళ్లలోపు బాలికల కటా విభాగంలో వై.కీర్తి ప్రథమ, సీహెచ్ భవగ్న తృతీయ స్థానాల్లో నిలిచి పతకాలను సాధించారని తెలిపారు. విద్యార్థులను, కోచ్ ఎన్.వెంకటేశ్వరరావును కళాశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, జబీనా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

కోడూరు, ఫిబ్రవరి 21: మాతృభాషా దినోత్సవాన్ని కోడూరు మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఉల్లిపాలెం - భవానీపురం వారధి వద్ద గల 27 అడుగుల తెలుగు తల్లి విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి పాదాల వద్ద పుష్పాలు చల్లి నివాళులర్పించారు. మర్రే గంగయ్య, కొండవీటి సునీత, లంకే భాస్కరరావు, కోట రాంబాబు, పూషడపు భానుమూర్తి పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం అందజేత

అవనిగడ్డ, ఫిబ్రవరి 21: నాగాయలంకకు చెందిన విద్యార్థిని నాగిడి గాయత్రి గోవాలో నిర్వహించిన 37వ జాతీయ కానోయింగ్ అండ్ కయాకింగ్ పోటీల్లో రజత పతకం సాధించింది. క్రీడల్లో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆమె జనసేన నాయకుడు, సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు రూ.10 వేలు అందించారు.

ప్రమాదకరంగా నిమ్మకూరు వంతెన

● మరమ్మతులు చేసేందుకు దాతలు ముందుకు వచ్చినా సహకరించని ఆర్అండ్‌బీ అధికారులు
● టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, సర్పంచ్ పడమట శ్రీనివాసరావు ఆరోపణ



వంతెన జాయింట్ల వద్ద బయటకు వచ్చేసిన ఐరన్ ప్లేట్లు

పామర్రు, ఫిబ్రవరి 21: నిమ్మకూరు గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిలో కాల్వలపై ఉన్న వంతెనకు కొంతకాలం కిందట జాయింట్ విరిగిపోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. తాత్కాలికంగా పంచాయతీ అధికారులు మరమ్మతులు చేయించి వినియోగంలో తెచ్చారు. అయినా మళ్లీ కొద్దిరోజుల కిందట వంతెన జాయింట్ విరిగిపోయి, జాయింట్లకు అమర్చిన ఐరన్ ప్లేట్లు బయ టకు వచ్చేశాయి. భారీ వాహనాలు గ్రామంలోకి రాలేకపోతున్నాయి. గ్రామ ప్రధాన రహదారిపై వంతెన కావడంతో గ్రామంలోకి వ్యవసాయ ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకోవడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ వంతెనపై నుంచే దిగువ గ్రామాలు అవిరి పూడి, నిభానుపూడి, కోసూరు, మంత్రిపాలెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు నడుస్తోంది. దీనిపై ప్రయాణిస్తుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వంతెనకు మరమ్మతులు చేసేందుకు దాతలు ముందుకు వస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించడంలేదని టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, సర్పంచ్ పడమట శ్రీనివాసరావు ఆరోపించారు. శాశ్వత మరమ్మతులకు అధికారులు సహకరించాలని కోరారు.



గుడివాడ 17వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు

వేసవి రాకమునుపే గుడివాడలో దాహం కేకలు

● పాలకుల నిర్లక్ష్యానికి ప్రజలకు ఇబ్బందులా?: వెనిగండ్ల రాము

గుడివాడ, ఫిబ్రవరి 21: "వేసవికాలం రాకమునుపే పట్టణ ప్రజలు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. పాలకుల నిర్లక్ష్యానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర, జాతీయ రాజకీయాలపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొడాలి నానికి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజలు అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పే దమ్ములేదు. 24 గంటలూ చంద్రబాబు, పవన్‌లను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు." అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం 17వ వార్డు పాతసంత రోడ్డులోని సర్దార్ గౌతులచ్చన్న విగ్రహం వద్ద నుంచి బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో తాము పడుతున్న కష్టాలను బంటుమిల్లి రోడ్డులోని వ్యాపారులు రాము దృష్టికి తీసుకువచ్చారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, తమ దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను పరిష్కరిస్తామని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు యక్కలి మణిదీప్, నాయకులు దింట్యాల రాంబాబు, గోకవరపు సునీల్, ముళ్లపూడి రమేష్, అందుగుల ఏసుపాదం, సిరిపురపు తులసీరాణి, లింగం చిట్టిబాబు పాల్గొన్నారు.

బంటుమిల్లి: మల్లంపూడిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. బొర్రా కాశీ, రేవు శ్రీనివాసరావు, రేవు గోపాలకృష్ణ, కొల్లాటి ఏడుకొండలు, చింతా వెంకటేశ్వరరావు, ఆంద్రాజు రాంబాబు, ఇల్లూరి లీలాకృష్ణ, అంగర రంగనాథ్, సింగంశెట్టి శ్రీను పాల్గొన్నారు.

కృష్ణానదిలో బాంబులేసి చేపలు చంపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నాగాయలంక, ఫిబ్రవరి 21: కృష్ణానదిలో బాంబులు వేసి చేపలు చంపే వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం మత్స్యభవనం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు నాగాయలంక, కోడూరు, మండలాల కృష్ణానది పరివాహక ప్రాంతంలో చట్ట విరుద్ధంగా బాంబులతో చేపలను చంపడంపై మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. చేపలను చంపడం వల్ల సంప్రదాయ వేటచేసే మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని, అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. బాంబులతో చేపలను చంపే వారిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు వీలుగా మత్స్యశాఖ, పోలీసు అధికారులతో నిఘా విభాగాలు ఏర్పాటు చేయాలని లకనం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.